# సాక్షి తిరుపతి

ఆదివారం । 12 । మే । 2024






## పుష్పయాగానికి అంకురార్పణ

శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఆదివారం జరగనున్న పుష్పయాగానికి అంకురార్పణ చేపట్టారు.

- 8లో



## నిమ్మమార్కెట్‌కు సెలవు

ఎన్నికల నేపథ్యంలో గూడూరులోని నిమ్మ మార్కెట్‌కు మూడు రోజులు పాటు సెలవు ప్రకటించారు.

- 8లో



## నృసింహుని కల్యాణం

రాపూరులోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి,అమ్మవార్ల కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు.

- 8లో

## న్యూస్‌రీల్

### ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

**తిరుపతి అర్బన్:** జిల్లా వ్యాప్తంగా రేపు జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే ఇబ్బందులుంటాయన్నారు. జిల్లాలో 2,140 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, అందులో 696 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు తెలిపారు. మొత్తం 964 మైక్రో అబ్జర్వర్లతో 1,401 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, 888 పోలింగ్ కేంద్రాలలో వీడియోగ్రఫీ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఉజ్వల్ కుమార్‌ఘోష్, రాజకీయ పార్టీల నేతలతోపాటు డీఆర్వో పెంచల కిషోర్ పాల్గొన్నారు.

### డ్యూటీకి డుమ్మాకొడితే చర్యలు

**తిరుపతి అర్బన్:** ఎన్నికల డ్యూటీకి డుమ్మాకొడితే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు నిర్దేశిత వెబ్‌సైట్లో డీఈఓ లాగిన్‌లో పోలింగ్ సిబ్బంది మూడో దఫా ర్యాండమైజేషన్, మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన ప్రిసైడింగ్ అధికారులు 2,430, సహాయ ప్రిసైడింగ్ అధికారులు 2,444, ఇతర పోలింగ్ సిబ్బంది 9,895 మంది, రిజర్వ్‌తో మొత్తం కలిపి 1,4769 మందిని, మైక్రో అబ్జర్వర్లు 1,036 మందిని నియమించినట్టు తెలిపారు. పోలింగ్ విధులు కేటాయించిన సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు వారికి కేటాయించబడిన నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు హాజరు కావాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 60,545 మంది స్వామివారిని దర్శించుకోగా 32,527 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 13 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### ● ముమ్మర ప్రచారం



గూడూరు నియోజకవర్గం చిల్లకూరులో ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గొర్రిపాటి వెంకటేశ్వర్లు - చిల్లకూరు



తిరుపతి జీవకోన సభకు పోటెత్తిన అభిమానులు (ఇన్‌సెట్) బహిరంగ సభలో ఎమ్మెల్యే భూమన, పక్కన వైఎస్ఆర్ సీపీ శ్రేణుల ఉత్సాహం

తిరుపతి జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే ఇంటింటా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ప్రచారాన్ని మరింత ఉధృతం చేశారు. అభ్యర్థుల తరపున సకుటుంబ సమేతంగా ప్రచార పర్వంలో పాల్గొని నీరాజనాలు అందుకున్నారు. గ్రామాల్లో కలియదిరుగుతూ ఓటర్ల నాడి పట్టారు. వారి సమస్యలు తెలుసుకుంటూ.. జగనన్న సంక్షేమ పథకాలు వివరిస్తూ దూసుకుపోయారు. ఇక కూటమి నేతల అభ్యర్థిత్వాన్ని తమ పార్టీ అధినేతలు నాన్చుతూ రావడంతో ప్రచారంలో కాస్త వెనకబడ్డారు. చివరి రోజు వరకు నాయకులందర్నీ ఒకతాటిపైకి తేలేక ముప్పతిప్పలు పడ్డారు.

# ఫ్యాను హోరు.. ప్రచార జోరు

## చివరి రోజు హోరాహోరీగా సాగిన ప్రచారాలు

- తిరుపతి జిల్లా వ్యాప్తంగా దూసుకుపోయిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- కపట కూటమి నేతలను ఛీకొట్టిన ప్రజలు
- సకుటుంబ సపరివార సమేతంగా చేపట్టిన ప్రచారానికి నీరాజనాలు
- సమరోత్సాహంతో ముందుకు సాగుతున్న సీఎం జగనన్న సైనికులు



వెంకటగిరి : నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ఆత్మీయ సత్కారం



తిరుపతి : మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి



చంద్రగిరి : ప్రజలకు అభివాదం చేస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



గూడూరు : ఎన్నికల ప్రచారంలో మేరిగ మురళీధర్



శ్రీకాళహస్తి: కుటుంబ సమేతంగా కలిసి రోడ్‌షో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

**సాక్షి, తిరుపతి :** సార్వత్రిక ఎన్నికల ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు దూసుకుపోయారు. నోటిఫికేషన్ వెలువడి నాటి నుంచి శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రచారాలను హోరెత్తించారు. ఎన్నికల ప్రచారాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముందుండగా.. కూటమి అభ్యర్థులు వెనకబడ్డారు.

**కుటుంబ సపరివార సమేతంగా..**

ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఓ వైపు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మరో వైపు ప్రచారాలు నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన సొంత నియోజకవర్గం పుంగనూరుతో పాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం కుప్పం, పలమనేరు, చిత్తూరు, పూతలపట్టు, గంగాధరనెల్లూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరు, వెంకటగిరిలో ప్రచారం చేశారు. రాజంపేట, చిత్తూరు, తిరుపతి ఎంపీ అభ్యర్థులు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, మద్దిల గురుమూర్తి ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అసెంబ్లీ అభ్యర్థుల విషయానికి వస్తే.. తిరుపతిలో అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి ఓ వైపు, తండ్రి టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తల్లి రేవతమ్మ, సతీమణి మేనిషారెడ్డితో పాటు మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్లు ఎవరికి వారు ప్రచారం నిర్వహించారు. చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విజయం కోసం తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తల్లి లక్ష్మి, సోదరుడు హర్షిత్‌రెడ్డి, చిన్నాన్నపెద్దనాన్న కుమారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితోపాటు భార్య బియ్యపు శ్రీవాణిరెడ్డి, కుమార్తె పవిత్రారెడ్డి, కుమారుడు ఆకర్ష్‌రెడ్డి, బావమరిది సామాన్ల శ్రీధర్‌రెడ్డి, బంధువులు ప్రచారం నిర్వహించారు.

**కుప్పం నుంచి గూడూరు వరకు**

సత్యవేడులో అభ్యర్థి నూకతోటి రాజేష్‌తోపాటు ఆయన భార్య చైతన్య భాను, సూళ్లూరుపేటలో కిలివేటి సంజీవయ్య, సతీమణి కిలివేటి సుభాషిణి, కుమార్తెలు సౌజన్య, దివిజ ప్రచారం చేశారు. వెంకటగిరిలో నేదురమల్లి రాంకుమార్‌రెడ్డి, తల్లి మాజీ మంత్రి రాజ్యలక్ష్మి, గూడూరులో అభ్యర్థి మేరిగ మురళీధర్, కుమారులు డాక్టర్ రేవంత్ చక్రవర్తి, హేమంత్ చక్రవర్తి ప్రచారం చేశారు. అభ్యర్థుల విజయం కోసం అంతా కలిసి కట్టుగా ప్రచారం నిర్వహించారు.

### సమరోత్సాహం

ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. మేమంతా సిద్ధం బస్సుయాత్ర, నియోజకవర్గాల వారీగా బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించారు. మొదట పుంగనూరు నియోజకవర్గం నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర చంద్రగిరి, పూతలపట్టు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు మీదుగా సాగింది. మరో విడతలో వెంకటగిరి, పలమనేరు, నగరిలో బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన కార్యకర్తలు, అభిమానుల్లో సమరోత్సాహం నింపింది.



సూళ్లూరుపేట : ప్రచారానికి భారీగా తరలివచ్చిన కార్యకర్తలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కిలివేటి సంజీవయ్య



సత్యవేడు : ఎన్నికల ప్రచారానికి పోటెత్తిన ప్రజలు (ఇన్‌సెట్) అభివాదం చేస్తున్న నూకతోటి రాజేష్

## నేడు భాష్యకారుల సాత్తుమొర

**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం భాష్యకార్ల సాత్తుమొర జరగనుంది. ఈ సందర్భంగా మే 3 నుంచి 21వ తేదీ వరకు 19 రోజులపాటు ఉభయం సమర్పణ జరుగుతోంది. శ్రీరామానుజులవారు జన్మించిన వైశాఖ మాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని ఒక తిరుచ్చిపై, శ్రీభాష్యకార్లవారిని మరో తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగిస్తారు. ఆ తరువాత ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు భాష్యకార్లవారి సన్నిధిలో సాత్తుమొర నిర్వహిస్తారు. ప్రత్యేక ఆభరణాలతో సల్లింపు చేపడతారు. జీయర్ స్వాములు, ఏకాంగులు పాల్గొననున్నారు.



## బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం



బంగారు తిరుచ్చిపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

**చంద్రగిరి:** శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవలు, ప్రత్యేక అలంకరణలు చేపట్టి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయ అవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

## ఎన్నికల ప్రచారం..పరిసమాప్తం



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

**తిరుపతి అర్బన్:** జిల్లాలో ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం జరగనున్న పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశామని వెల్లడించారు. మంగళవారం ఉదయం వరకు జిల్లాలో 144 సెక్షన్ కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రంలో న్యాయనిర్ణేత ప్రిసైడింగ్ ఆఫీసరేనని చెప్పారు. ఓటర్ స్లిప్ లేకున్నా పర్వాలేదని, ఓటర్ లిస్ట్‌లో పేరు ఉంటే చాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికల పోలింగ్ ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చ పత్రిక బ్రోకర్లు.. భూకబ్జాకోరులు

- నకిలీమందులతో వ్యాపారం
- అధికారులను బెదిరించి రూ.లక్షలు దండుకున్న అవినీతిపరులు
- కూటమి అభ్యర్థితో కుమ్మక్కై తప్పుడు కథనాలు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం



తిరుపతి జీవకోనలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న భూమన కరుణాకర రెడ్డి

**తిరుపతి అర్బన్ :** పచ్చపత్రికను అడ్డుపెట్టుకుని తిరుపతి జిల్లాలో ఇద్దరు ఆంధ్రజ్యోతి బ్రోకర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి జీవకోనలో శనివారం నిర్వహించిన సభలో వారి అవినీతి అక్రమాలను ప్రజలకు తెలియజేశారు. జిల్లాలో ఇద్దరు ఆంధ్రజ్యోతి ప్రతినిధులు అడ్డదిడ్డంగా తప్పుడు కథనాలు రాస్తున్నారన్నారు. కూటమి అభ్యర్థితో కుమ్మక్కై వారు వేసే కుక్క బిస్కెట్లకు లొంగి ఇలా తమపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నారని మండిపడ్డారు. సమాజానికి చీడపురుగులాంటి వారని మండిపడ్డారు.

**అక్రమణల చిట్టా ఇదిగో..**

ఒకరు మన్నారుపోలూరు కృష్ణస్వామి ఆలయానికి చెందిన 50 సెంట్ల భూమి ఆక్రమించి సొమ్ము చేసుకున్న ఘనుడని ఆరోపించారు. అలాగే బీఎస్ కండ్రిగ దళితవాడకు చెందిన ఓ వ్యక్తిని బెదిరించి 1.5 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నాడని, తిరుపతి ఎర్రమిట్టలో జర్నలిస్టులు ఇచ్చిన భూములను బినామీ పేర్లతో ఆక్రమించుకున్నాడని ఆరోపించారు. అలాగే నారాయణాద్రి ఆస్పత్రి వద్ద 22ఏ కింద ఉన్న ఎకరం భూమిని చంద్రబాబునాయుడిని అడ్డుపెట్టుకుని సెటిల్ చేసుకున్నాడని తెలిపారు. తిరుపతి సమీపంలోని కొత్తూరు వద్ద రెండు ఎకరాల బీనామీ పేరుతో పట్టా చేసుకుని మామిడితోట వేసుకున్న భూ కబ్జాదారుడు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మరో వ్యక్తి తిరుపతి భవానీనగర్‌లో స్నేహితులతో కలిసి మందుల షాపు పెట్టి ఆ తర్వాత వారిని బెదిరించి సొంతం చేసుకున్నాడని, అంతేకాకుండా ఆ మందుల షాపునకు అపోలో మెడికల్ షాపు అని బోర్డు పెట్టి నకిలీ మందులు విక్రయిస్తున్న నీచుడని ఆరోపించారు. చిగురవాడ, చెర్లోపల్లి ప్రాంతాల్లో భూములు ఆక్రమించుకుని విక్రయించుకున్న చీడపురుగు అన్నారు. అంతేకాకుండా తిరుపతి తుడా, కార్పొరేషన్ కార్యాలయాల్లో అధికారులను బెదిరించి రూ.లక్షలను దోచుకుంటున్న దోపిడీదారు మండిపడ్డారు. వీళ్లా తన గురించి విమర్శించి అబద్ధపు రాతలు రాసేది..? అని ప్రశ్నించారు.

**అభివృద్ధి చేశాం.. ఓట్లు అడుగుతున్నాం**

తిరుపతిలో తాము నిర్మించిన మాస్టర్‌ప్లాన్ రోడ్లు, అత్యంత సుందరంగా తీర్చిదిద్దినందుకు ఓట్లు వేయాలని స్థానికులను అభ్యర్థించారు. అలాగే స్థానికులు 1.5 లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పించామన్నారు. గంగమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించి ఆరు లక్షల మందికి దర్శనభాగ్యం కల్పించినట్టు వెల్లడించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులందరికీ అందజేశామన్నారు. తిరుపతిలో రౌడీమూకలను తరిమికొట్టామని, ఆధ్యాత్మిక ప్రాంతంలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించామని చెప్పారు. టీటీడీలో పనిచేస్తున్న వేలాదిమంది జీతాలు పెంచినట్టు గుర్తుచేశారు. ఎన్నో ఏళ్లుగా 22ఏతో కుమిలిపోతున్న 8వేల కుటుంబాల్లో వెలుగులు నింపామని తెలిపారు. దశాబ్దాలుగా ఉన్న శెట్టిపల్లి భూ సమస్యలను పరిష్కరించి వారికి భూ హక్కు కల్పిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చినందుకు తమకు ఓట్లు వేయాలంటూ ప్రజలను కోరారు.

## విద్యుత్ తీగలు తగిలి అడవి పంది మృతి

– కేసు నమోదు చేసిన అటవీ అధికారులు


విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన వరాహం

**చంద్రగిరి:** టీడీపీ నాయకులు వన్యప్రాణులను వేటాడి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనే శనివారం మండలంలో ఓ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండల పరిధిలోని ఏ.రంగంపేటకు చెందిన కాయం రాజశేఖర్‌రెడ్డి నాగపట్ల సమీపంలోని తన పొలంలో అటవీ జంతువుల కోసం విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఓ వరాహం అడవి నుంచి తప్పిపోయి పంట పొలం వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో టీడీపీ నేత ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి వరాహం అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాజశేఖర్‌రెడ్డి అనుయాయులు డీ.రాజశేఖర్, వెంకటరమణ(బ్యాటోడు), డీ.ప్రవీణ్, పొలం కాపరి చంచయ్య అడవి పంది మాంసాన్ని సేకరించేందుకు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో అటవీ అధికారులకు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసు అధికారులను చూసి అనుమానితులు అక్కడి నుంచి పరుగులు తీశారు. అనంతరం మృతి చెందిన వరాహాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై ఎఫ్ఎస్ఓ తోఫిక్‌ను వివరణ కోరగా.. విద్యుత్ తీగలు తగిలి అడవి పంది మృతిచెందిందని, ఈ మేరకు పోస్టుమార్టం నిర్వహించి, పొలం యజమాని కాయం రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## క్లుప్తంగా

### కృష్ణయ్యపై దాడి ఘటన కేసులో పురోగతి

గుర్తుతెలియని వ్యక్తులపై కేసులు

**ఏర్పేడు:** బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యపై రాయితో దాడి చేసిన ఘటనలో గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ గురువారం రాత్రి ఏర్పేడు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి మద్దతుగా ఆర్.కృష్ణయ్య ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని తెలిపారు. ఆ సమయంలో గుర్తుతెలియని దుండగుడు ఆయనపై రాయితో దాడిచేసినట్లు చెప్పారు. ఆ ఘటనలో ఆర్.కృష్ణయ్య వీపుపై గాయమైందన్నారు. ఈ ఘట నపై అదే రోజు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్ ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. విచారణలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

### ఉచిత వేసవి శిక్షణ తరగతులు

**తిరుపతి సిటీ :** స్థానిక జాతీయ సంస్కృత వర్సిటీ, సంస్కృత భారతి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు సంస్కృత భాషలో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ రమాశ్రీ తెలిపారు. బాలనందనం అనే పేరుతో ఎల్‌కేజీ నుంచి 13 సంవత్సరాల లోపు పిల్లలకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, 13 ఏళ్ల వయస్సు పైబడిన వారికి సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరిన్ని వివరాలకు 8367476975, 9441316319 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### శ్రీవారి సేవలో టీడీపీ అధినేత


తిరుమల ఆలయం వెలుపల చంద్రబాబు

**తిరుమల:** తిరుమల శ్రీవారిని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్–1 గుండా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

## ప్రలోభాలపై చర్యలు తీసుకోండి


దొరబాబు, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు

**తిరుపతి లీగల్:** తిరుపతి నియోజకవర్గంలో కూటమి తరపున పోటీలో ఉన్న అభ్యర్థి ఎక్కువ మొత్తంలో డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నారని, దీనిపై చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. ఎన్నికల నియమ, నిబంధనలకు విరుద్ధంగా కూటమి నాయకులు డబ్బు, మద్యాన్ని డంప్ చేశారని ఆరోపించారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## వైభవంగా నృసింహుని కల్యాణం


స్వామి,అమ్మవార్ల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

**రాపూరు:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం వైభవంగా జరిగింది. తెల్లవారుజామునే సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి నిత్యకల్యాణ మండలపంలో కొలువుదీర్చారు. అనంతరం శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు.

## 19 నుంచి బ్రహ్మోత్సవాలు


పోస్టర్లను విడుదల చేస్తున్న ఈఓ, కమిటీ సభ్యులు

**చిల్లకూరు :** మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 19 నుంచి 24 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు ఈవో తాతా శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి బ్రహ్మోత్సవాల పోస్టర్లు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 19న మృత్సంగ్రహణం, అంకురార్పణం, 20న తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, 21న హనుమంత వాహనం, 22న శ్రీలక్ష్మీ నరసింహస్వామి జయంతి, శ్రీవారికి గరుడ సేవ, 23న స్వామి కల్యాణం, రాత్రికి గజవాహన సేవ, 24న వసంతోత్సవం, చక్రస్నానం, పుష్పయాగం, రాత్రి ఏకాంత సేవ నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కూతురి టికెట్‌ని లాక్కున్న నీచుడు కురుగొండ్ల

వైఎస్సార్‌సీపీలోనే బీసీలకు సముచిత స్థానం

డాక్టర్ మస్తాన్‌యాదవ్



**వెంకటగిరి రూరల్ :** కురుగొండ్ల రామకృష్ణ కూతురికి టీడీపీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, దాన్ని భరించలేక కురుగొండ్ల రాజకీయం చేసి తన పేరుతో బీఫారం తెచ్చుకున్నాడని వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ మస్తాన్‌యాదవ్ ఆరోపించారు. ఆయన శనివారం వెంకటగిరిలోని తన ట్రస్టు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీలో బీసీలకు గుర్తింపు లేదన్నారు. తాను ఆ పార్టీకి ఎంతో సేవ చేశానని తెలిపారు. ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని నమ్మించి చివరకు చంద్రబాబు నాయుడు తమ సామాజిక వర్గానికి చెందిన వారికే టికెట్ ఇచ్చాడన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికీ సముచిత స్థానం ఇచ్చారని గుర్తు చేశారు. వెంకటగిరిలో అభివృద్ధి జరగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి నేదురుమల్లిని గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. పొరపాటున టీడీపీకి ఓటు వేస్తే దౌర్జన్యాలు పెరిగిపోతాయన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు.

## వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు


పాకాల : పార్టీలో చేరిన టీడీపీ నాయకులు

**పాకాల:** మండలంలోని కె.వడ్డేపల్లి పంచాయతీ, అమ్మగారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు చిటిపిరాళ్ల చెన్నకేశవరెడ్డి సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఈ మేరకు టీడీపీ నాయకులు ఎస్.చెంగల్‌రెడ్డి, ఎస్.హేమంత్‌రెడ్డికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో శ్రీరాములరెడ్డి, విక్రమ్‌రెడ్డి, మురళిరెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం


నర్సులను సన్మానిస్తున్న ప్రగతి సేవా సంస్థ ప్రతినిధులు

**గూడూరు రూరల్ :** గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కరోనా కాలంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించిన నర్సులు పి.విజయ, ఎం.ధనలక్ష్మి, బి.వెంకటేశ్వరమ్మ, ఫర్వీన్, కృష్ణప్రియ, టి.కోమలకు ఏరియా ఆత్మీయ సత్కారం చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి పంచి పెట్టారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, డాక్టర్లు మధు, రాజా, హెడ్ నర్స్ విజయ, గౌరీ, సంస్థ సభ్యులు రామ్మోహన్‌రావు, రాము, కుమార్ నాయుడు, పెంచలయ్య, మునిప్రసాద్, నాగరాజు, మౌలాలి, సాయి పాల్గొన్నారు.

## మేధోమథనం

# గుణపాఠం తప్పదు బాబు!

- విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించిన చంద్రబాబు
- ఇంగ్లిషు మీడియాన్ని పేదలకు దూరం చేసిన నీచుడు
- పేదరికానికి విద్యతో శాశ్వత చికిత్స చేస్తున్న సీఎం జగన్
- ఉన్నత ఉద్యోగాల సాధనలో ఇంగ్లిషు మీడియం ఆయుధం
- యోగివేమన వర్సిటీ పాలకమండలి మాజీ సభ్యుడు డీవీఎస్ చక్రవర్తిరెడ్డి


డీవీఎస్ చక్రవర్తిరెడ్డి

**తిరుపతి సిటీ:** 'రాష్ట్రంలో విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిన నీచుడు చంద్రబాబు. ఆయన హయాంలో కార్పొరేట్‌కు కొమ్ముకాశి ప్రభుత్వ విద్యను పేదలకు దూరం చేశారు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో నూతన సంస్కరణలు తీసుకువచ్చారు. ఉన్నత చదువులకు అడ్డు తగులుతున్న పేదరికం అనే వ్యాధికి శాశ్వత చికిత్స చేస్తున్నారు' అని ఎస్‌డీహెచ్‌ఆర్ సంస్థల అధినేత, యోగివేమన వర్సిటీ పాలకమండలి మాజీ సభ్యుడు డీవీఎస్ చక్రవర్తిరెడ్డి తెలిపారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో విద్యారంగంలో జరిగిన పెనుమార్పులపై ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**బాబు పాలనలో ప్రభుత్వ విద్య సర్వనాశనం**

'చంద్రబాబు పాలనలో ఏపీలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. కనీస సదుపాయాలకు నోచుకోక, అవసరమైన ఉపాధ్యాయులను నియమించకపోవడంతో పేద విద్యార్థులు చాలామంది చదువుకు దూరమయ్యారు. చంద్రబాబు విద్యను వ్యాపారంగా మార్చి పేదలకు ఉన్నత విద్యను, ఇంగ్లిషు మీడియాన్ని దూరం చేశారు. దీంతో డిగ్రీలు, పీజీలు చదివిన గ్రామీణ యువతకు ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాలు లభించేవి కావు. ఉద్యోగం సాధించలేక చాలా మంది కూలీలుగా ఇతర ప్రాంతాలకు వలసవె వెళ్లారు. బాబు పాలనలో నిరుద్యోగం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తాండవించింది. 2014 నుంచి 2019 వరకు జిల్లా ఉపాధి కొలమాన సర్వే నివేదిక ప్రకారం కేవలం చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో నిరుద్యోగులు 45 శాతానికి మించి పెరిగింది. ఇందుకు ప్రధాన కారణం కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రతిభ చూపకపోవడమే.

**ఇదే బాబు తత్వం**

14ఏళ్ల పాటు సీఎంగా కొనసాగిన చంద్రబాబు పేదలకు చేసిన మేలు శూన్యం. నిరుపేద పిల్లలు పేదరికాన్ని వారసత్వంగా తీసుకుని పేదలుగానే జీవించాలనేది ఆయన తత్వంగా కనిపిస్తోంది. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కరోనా సమయంలో ఆంధ్రను వదిలిపెట్టి హైదరాబాద్‌లో కూర్చొన్నారు. ఎన్నికలకు సమయం ఆసన్నమవడంతో ప్రజలను మభ్యపెట్టే మేనిఫెస్టోతో ఆంధ్రలో తిరుగుతున్నారు.

**ఎడెక్స్ నివేదికలో ఏపీ టాప్**

ఏపీలో విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చిన సీఎం జగన్ కృషి ఫలించింది. 2019కి ముందు విద్యారంగంలో ఏపీ లెవల్–6 స్థానంలో ఉండగా ఇటీవల కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఎడెక్స్ నివేదిక ప్రకారం ఏపీ టాప్–2 లెవల్‌లో నిలిచింది. ఎన్‌రోల్‌మెంట్, విద్యాప్రమాణాలు, సమానత్వం, మౌలిక సదుపాయాల కల్పనలో 1000 పాయింట్లకు గాను 940పాయింట్లకు పైగా సాధించింది. దేశంలోని ఏ ప్రభుత్వ పాఠశాలలో లేని వందశాతం డిజిటల్ విద్యావిధానం అములు చేస్తున్న రాష్ట్రంగా ఏపీ గుర్తింపు తెచ్చుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ సంస్థలకు మించి వసతులు కల్పిస్తున్నారు. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెరుగైన నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు డైలీ మెనూను అమలు చేస్తున్నారు. విద్యారంగంలో ఏపీ దేశానికి ఆదర్శమని పలువురు ముఖ్యమంత్రులు, విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు' అని ఆయన పేర్కొన్నారు.

## పుష్పయాగానికి అంకురార్పణ

**తిరుపతి కల్చరల్:** శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఆదివారం జరగనున్న పుష్పయాగానికి శనివారం ఘనంగా అంకురార్పణ చేపట్టారు. ఉదయం ఆచార్య రుత్విక్ వరణం నిర్వహించారు. సాయంత్రం సేనాధిపతి ఉత్సవం, రాత్రి మేదినీపూజ, మృత్సంగ్రహణం, శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. కాగా ఆదివారం సాయంత్రం పుష్పయాగం నిర్వహించనున్నారు. రాత్రి స్వామి, అమ్మవార్లు వారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కటాక్షించనున్నారు.

## నిమ్మ మార్కెట్‌కు మూడు రోజుల సెలవు

**గూడూరు రూరల్:** గూడూరులోని నిమ్మ మార్కెట్‌కు సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు సెలవు ప్రకటించినట్లు బాలాజీ లెమన్ మార్కెట్ యాజమాన్యం ప్రకటించింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం సెలవు ఇచ్చినట్టు పేర్కొన్నారు. అదేవిధంగా మంగళ, బుధవారం కూడా మార్కెట్‌కు సెలవు ఉంటుందన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు.